# సొంతం ముంచిన సవరం జడ

జలజ చిన్నప్పట్నుంచీ చాలా చలాకీ అయిన పిల్ల. వాళ్ల ఊళ్లో ముగ్గుల పోటీల్లో చాలాసార్లు బహుమతులు సంపాదించింది. ఆమె సంపాదించిన బహుమతులు చూసి ఓర్వలేని వారు ఆ ఏదో అదృష్టం వలన వచ్చిన బహుమతులనే వారు.

జలజ జడ చాలా పొడవుగా నల్లతాచు పాములాగా ఉండేది. ఆమె ముగ్గులు వేసేటప్పుడు ఎవ్వరో ఒకరు ఆ జడ మట్టి అవకుండా పైకెత్తి పట్టుకునేవారు. జలజలా ముగ్గులెయ్యలేని వాళ్లు, "అంబలి తాగేవాడికి మీసాలెత్తే వాడు ఒకడు", అని వెక్కిరించేవారు.

జలజ చదువులో కూడా చాలా దిట్ట. చాలా మంచి మార్కులు సంపాదించి ఎప్పుడూ క్లాసులో ఫస్ట్‌గా ఉండేది. చదివి చదివి వేడి వలన కాబోలు యూనివర్శిటిలో పిహెచ్.డి చేసేటప్పుడు, ఒకసారి జబ్బు చేసి జుట్టు చాలా మట్టుక్కి ఊడిపోయింది. అప్పట్నుంచీ సవరం పెట్టుకునేది. అయినా అది సవరం జడ అని ఎవరికీ తెలీదు. ఆ జడ చూసిన వాళ్లు "అబ్బ ఎన్ని సంవత్సారాలైనా నీ జుట్టు అసలు ఒత్తు తగ్గలేదు" అని మొచ్చుకునే వారు.

జలజకి పెద్ద ఉద్యోగం వచ్చింది. ఆ కంపెనీలో ఆమె ఎంత చెపితే అంత! జలజ కంపెనీలో ముత్తుమణి అనే అతను పనిచేస్తుండేవాడు. ఇతను మద్రాస్‌లో బి.ఎ. చదువుకున్నాడు. విద్యకి తగిన ఉద్యోగం దొరక్క, జలజ కంపెనీలో ఒక చిన్న ఉద్యోగంలో ప్రవేశించాడు. ఎవరో చెప్పారు "జలజగార్ని మంచి చేసుకుంటే మంచి ఉద్యోగం వస్తుందని", మెల్లిగా ఆవిడ్ని మంచి చేసుకునే ప్రయత్నంలో ఇంటికి వెళ్లి, వేడి వేడి యిడ్లీ రొంబఫైన్ సాంబారూ తయారు చేసేవాడు. మధ్య మధ్యలో జలజతో పిచ్చాపాటీ మాట్లాడేవాడు.

ముత్తుమణి తెలుగు అదోమాదిరిగా ఉండేది. అతని మాతృబాష 'తమిళ్' అవడం వలన, తెలుగు అంత బాగా మాట్లాడ లేక అక్కర్లేని చోట, కొన్ని సున్నాలు పెడుతూండేవాడు.

ఒక ఆదివారం జలజతో పాటు గుడికి వెళ్ళి మర్నాడు ఆఫీసులో 'కోవెల దగ్గర ఆండవాళ్ళు కోంతికి అంటి పండు వేశారు" అని అందరికీ చెప్పాడు. ఈ భాష విని, జలజతో సహా అందరూ నవ్వుకున్నారు.

ఏదేనా సంతోషం కలిగితే "రొంబ ప్రమాదమా! సార్" అనేవాడు పాపం వీడికెప్పుడూ ప్రమాదమే! అనుకునేవారు విన్నవాళ్లు.

ముత్తుమణి చేసిన యిడ్లీలు తిని తిని యిడ్లీలా తయారయింది జలజ! ఒకసారి ప్రమోషన్ ఇప్పించమని ఏడ్చినంత పని చేశాడు. సరే! జలజ మనస్సు వాడి అశ్రుజలధారలు చూసి నీరైపోయింది.

కంపెనీ ఎం.డి. గారికి చెప్పి, ఒక ఇంటర్వ్యూ ఏర్పాటు చేసింది. ఇంటర్వ్యూ రోజు కూడా, ఇంటర్వ్యూలో ఏమడుగుతారో అన్న దిగులు లేకుండా జలజ ఇంట్లో యిడ్లీలు వేశాడు. ముత్తుమణితో పాటు ఇంకో పదిమంది అభ్యర్థులకి కూడా అదే రోజు ఇంటర్వ్యూ పెట్టారు. పొద్దున్న తొమ్మిది గంటలకే ఇంటర్వ్యూలు మొదలైనాయి.

జలజతో పాటే ముత్తుమణి కూడా ఆమె కార్లో వచ్చేశాడు. జలజ సరాసరి ఎం.డి. గారి చాంబర్స్‌కి వెళ్ళిపోయింది. మొత్తం నలుగురున్నారు ఇంటర్వ్యూ కమిటీలో!

కారు షెడ్‌లో పెట్టించి వచ్చేస్తూంటే ముత్తుమణికి కారు వెనుక సీట్లో సవరం కనిపించింది. అయ్యో అమ్మగారి సవరం "ఊడి పూడ్చినది" అని బాధపడి, ఆ సవరం ఆవిడికి ఇచ్చి కాకాపడితే ఉద్యోగం ఖాయంగా వచ్చేస్తుందని ఆశపడి, ఆ సవరం తీసుకుని సరాసరి కమిటీ రూమ్‌కి వెళ్లి "మేడమ్! నీ సవరం పడి పూడ్చినది" అని ఆవిడకి ఇవ్వబోయాడు.

జలజ అగ్గిమీద గుగ్గిలమైపోయి "వాట్ నాన్సెన్స్! బిహేవ్ యువర్ సెల్ఫ్, గెటవుట్" అని గట్టిగా అరిచింది.

ముత్తుమణి హడలిపోయాడు. ఆ సవరం ఏం చెయ్యాలో తెలీలేదు.

ముత్తుమణిని ఆఖరి క్యాండిడేట్‌గా ఇంటర్వ్యూ చేశారు. మతిపోయిన ముత్తుమణి ఆ సవరం ఏం చెయ్యాలో తేల్చుకోలేక, అది చేత్తో పట్టుకునే ఇంటర్వ్యూకి వెళ్లాడు. ఆ సవరం మళ్లీ చూసిన జలజ కళ్లు ఎర్రబడ్డాయి.

ముత్తుమణిని అనేక కష్టమైన ప్రశ్నలేసి, నానా హింసా పెట్టింది జలజ. ఒక్క ప్రశ్నకీ జవాబు చెప్పలేకపోయాడు ముత్తుమణి. అమ్మగారి సవరమే ముత్తుమణి పాలిటి తాచుపామైంది.

మార్కులు సున్నా అయిపోయాయి. ఎన్నోరోజులు ఎండనక, వాననక అమ్మాగారింట్లో చేసిన చాకిరీ వృధా అయిపోయింది! ఎలా అయినా ముత్తుమణికి మంచి ఉద్యోగం వచ్చిందనుకున్నవారు, దెబ్బతిన్నాడని తెలిసి బాధపడ్డారు.

ఏం జరిగిందని ముత్తుమణిని అడిగితే "ఏమో సార్ నాకు పురియాదు" అమ్మగారి సవరం పడిపోతే అది ఆమెకి ఇచ్చాను. ఎవరి వస్తువులు వారికి ఇవ్వడం తప్పని తెలియదు సార్! ఈ ప్రమోషన్ వస్తుందనీ, రొంబ ప్రమాదంగా ఉంటుందనీ అనుకున్నాను సార్" అన్నాడు.

ఆఫీసులో ఒకతను అన్నాడు. "ఇప్పుడు వచ్చింది ప్రమాదమే కదా!"

"నే చెప్పేది మా ప్రమాదం సార్" అన్నాడు ముత్తుమణి.

"భాషకో ప్రమాదం ఉంటుందా" అన్నాడు ఇంకొకడు.

"తమిళంలో ప్రమాదమంటే సంతోషం. మన 'ప్రమోదం' అన్నమాట"! అని సంశయ నివృత్తి చేశాడు ఇంకోడు.

"ఆ! మా తెలుగులోని పదాలకి అక్కర్లేని చోట సున్నాలు తగిలించి, మా చెవులు చిల్లులు పడేటట్లు చేశావు! అందుకే మా తెలుగుతల్లి నీ ప్రమోషన్‌కి ఆ సవరంతో సున్నా చుట్టేసింది!" అనుకున్నాడు, ఇంకొకడు.

ఆఫీసులో చాలా మందికి జలజగారిది సవరం జడని తెలిసిపోయింది. వనజ తన కొలీగ్‌తో అంది. "అబ్బ! జలజ మేడమ్ ఇన్నాళ్లూ ఏం పోజు కొట్టిందే! నేను లోపలికి వెళ్లినప్పుడు ఆవిడ జడ ముందుకి వేసుకునేది! అది ఒరిజినల్ అనుకున్నాను. నీకు తెలుసు కదా! నాది పొట్టి జడని! చాలా సార్లు బాధపడేదాన్ని, నాజడ కూడా మేడమ్ జడంత ఉంటే ఎంత బాగుండునూ అని! అందుకనే ఎప్పుడూ పోజులు కొట్టకూడదే! దేవుడు లేడా! ముత్తుమణి రూపంలో వచ్చి, జలజ మేడమ్‌ది, సవరం జడ అని అందరికీ తెలిసేలా చేశాడు"

ఒక సెలవు రోజున ముత్తుమణిని ఇంటికి రమ్మని "ముత్తూ! ఏం బాధపడకు ప్రమోషన్ రాలేదని! ఎవ్వరి వస్తువులు వాళ్లకి ఇవ్వడంలో ఏం తప్పులేదు!

ముఖ్యంగా ఎవరి సవరాలు వాళ్లకి ఇచ్చేస్తూండు! జలజ అన్నా వనజ అన్నా ఒకటే అర్ధం. ఎటొచ్చీ మా జడల్లోనే ఇన్నాళ్ళూ తేడా ఉండేది. ఈ అయిదు వందలూ వాడుకో! ఎప్పుడైనా డబ్బు కావలిస్తే అడుగు!'' అంది, ఇన్నాళ్లూ అసూయతో రగిలిపోయిన వనజ.

''ఆమ! రొంబ ప్రమాదం మేడమ్!'' అన్నాడు, ముత్తుమణి.

(ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 13-4-2006)